సచివాలయాల్లో వృద్ధుల పడిగాపులు



యర్రగుంట్ల ఆరో సచివాలయంలో పింఛన్‌కోసం ఫొటో తీస్తున్న ఉద్యోగి



ఊత కర్ర పట్టుకొని తోటివారి సాయంతో వస్తున్న వృద్ధుడు

ఇంటింటా పింఛన్ పంపిణీ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్న వారంతా ఆటోలలో ఇతరుల సాయంతో ప్రభుత్వ సచివాలయాల వద్దకు రావాల్సి వస్తోంది. ఉదయం పది గంటలకు వచ్చి సచివాలయ సిబ్బంది పంపిణీ చేపడితే ఎప్పుడో కానీ వారి వంతు రావడం లేదు. దీంతో చాలాసేపు వేచి ఉండాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు తెల్లవారుజామునే పింఛన్ పంపిణీ ఇంటి వద్దే జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ ఉద్యోగులు తమకు పనిభారం అధికంగా ఉందని, ఇంటింటికి వెళ్లి డబ్బు ఇవ్వలేమని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకునే పరిస్థితి తలెత్తింది. దీంతో పలువురు కార్యాలయాల వద్దకు రాలేక అవస్థ పడుతున్నారు. – ఎర్రగుంట్ల

క్లుప్తంగా

ఆయుధ పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న డాక్టర్లు

పులివెందుల: దసరా ఉత్సవాలలో భాగంగా పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, వైద్యులు డాక్టర్ సుకన్య, డాక్టర్ సౌమ్య, డాక్టర్ అనన్యల ఆధ్వర్యంలో ఆపరేషన్ థియేటర్‌లో దుర్గా మాత పూజ, ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుహాసిని, శిరీష, రక్తనిధి ల్యాబ్ టెక్నీషియన్ రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

వేంపల్లి: వేంపల్లి పంచాయతీలో డ్రైనేజీ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్డీఓ విజయలక్ష్మి అన్నారు. వేంపల్లె పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి, కొళాయి, వాణిజ్య సదుపాయాలు, పన్నులను ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ నాగభూషణ్ రెడ్డి, డీఎల్‌డీఓ రామాంజనేయరెడ్డి, ఈఓపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఐవీని నివారిద్దాం



అవగాహన కల్పిస్తున్న సీడీఎస్, సిబ్బంది

పులివెందుల టౌన్: హెచ్ఐవీని నివారిద్దామని స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు అన్నారు. పట్టణంలోని గాంధీ సర్కిల్, పూలంగళ్ల వద్ద గల బస్టాండు బీఎస్ఎన్ఎల్, ఆర్టీసీ పాత బస్టాండు, పురవీధులలో పలువురికీ హెచ్ఐవీ గురించి బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రజలను చైతన్యపరుస్తూ, ప్రతిచోట చర్చించుకోవడం వల్ల వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చునన్నారు. అనంతరం వారు ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వల్లి, నగేష్‌బాషా, అనురాధ, పుష్పరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జంతు వధ చేయరాదు

కమలాపురం: గాంధీ జయంతి సందర్భంగా కమలాపురం నగర పంచాయితీ పరిధిలో గురువారం జంతువధ చేయరాదని నగర కమిషనర్ ప్రహ్లాద తెలిపారు. చికెన్, మటన్ సెంటర్లతో పాటు మాంసాహారం విక్రయించరాదని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా విక్రయాలు జరిపితే కేసు నమోదు చేసి, దుకాణాల లైసెన్సులు రద్దు చేసి, రూ.5 వేల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

కానిస్టేబుళ్లకు అభినందన



కానిస్టేబుళ్లను అభినందిస్తున్న సీఐ, ఎస్ఐలు

కొండాపురం: నూతనంగా పోలీస్‌శాఖకు ఎంపికైన కానిస్టేబుళ్లంతా ప్రజలకు నమ్మకం కలిగేలా పని చేయాలని సీఐ రాజా, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కొండాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంపికైన నూతన కానిస్టేబుళ్లను బుధవారం వారు అభినందించారు. వారు మాట్లాడుతూ విధులలో అంకిత భావంతో పనిచేసి పోలీస్ ప్రతిష్ఠ పెంచేవిధంగా చూడాలన్నారు.

సమ్మెలో వైద్యులు



వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారిణి

ఎర్రగుంట్ల: పీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యాధికారులు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేపట్టడంతో పీహెచ్‌సీలలో రోగులకు వైద్యం ఆలస్యమవుతోంది. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి నుంచి డిప్యూటేషన్‌పై ఓ వైద్యాధికారిణి నియమించినా అధికంగా రోగుల సంఖ్య ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు.

జగన్మాత సాధించిన విజయం.. దసరా



నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం: జగన్మాత సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి జరుపుకొంటారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ బుధవారం ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ చెడు ఎంత దుర్మార్గమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి విజయాలు వరించేలా దుర్గా మాత దీవించాలని ఆయన ఆకాంక్షించారు.

రైతులకు రాయితీపై విత్తనం అందజేయాలి



మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం: ఖరీఫ్‌లో కష్టాలు పడిన రైతులకు రబీలో రాయితీపై శనగ, వేరుశనగ విత్తన అందించాలని హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రబీలో ముందస్తుగానే వర్షాలు కురవడంతో వెంటనే విత్తనం, ఎరువులు, డీఏపీ రైతులకు అందించాలని ఆయన కోరారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు అందివ్వాలన్నారు. యూరియా కోసం రైతులు కష్టాలు పడుతున్నా, గత నెలలో రాజంపేట పర్యటనలో సీఎం రూ.1200 మద్దతు ధర ప్రకటించి ఉల్లి కొనుగోలు చేస్తామని చెప్పినా స్పందన లేదన్నారు. చీనీ పంటకు ధరలేదని, అరటి టన్ను రూ.4వేలు పలకడం లేదని తెలిపారు. పంటల భీమా పై అధికారులకు స్పష్టత లేదని విమర్శించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, గంగాధర్ రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, నారపురెడ్డి, దేవదానం, నారాయణరెడ్డి, శివ క్రిష్టారెడ్డి, సుబ్బన్న, నగేష్, సురేష్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



శ్రమదానం చేస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లి: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. వేంపల్లె వైఎస్సార్ మెమోరియల్ పార్కులో బీజేపీ నాయకులతో కలిసి బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛత కోసం శ్రమదానం పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ నాగభూషణ్‌రెడ్డి, దొంతు సుమన్, సునీల్ కుమార్, మునగల చంద్ర, ఎర్రబోయిన రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?



రంగనాథస్వామి గుడి సమీపంలో రోడ్డు


పులివెందుల పట్టణంలోని రంగనాథస్వామి ఆలయ సమీపంలో రింగ్‌రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మధ్యలో పూల మొక్కలు ఉండడంతో ఆలయంలోకి వెళ్లాలంటే అటువైపు వస్తున్న వాహనాలు కనిపించక జనం ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు గుడి ఎదుట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

– పులివెందుల రూరల్

అమ్మా భవానీ.. గాయత్రీదేవి



లక్ష్మీదేవిగా యర్రగుంట్ల అంకమ్మతల్లి



పులివెందుల టౌన్: గజలక్ష్మీ దేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



సింహాద్రిపురం: మహిషాసురమర్దినిగా చౌడేశ్వరీదేవి



దుగ్గాయపల్లెలో మహిషాసురమర్దినిగా



పులివెందుల టౌన్: రాజరాజేశ్వరీ దేవిగా అంకాలమ్మ



పాలతలలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు

నియోజకవర్గ వ్యాప్తంగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. వందలాది భక్తులు హాజరైన దర్శించుకున్నారు.

పులివెందుల టౌన్: పట్టణంలోని చౌడమ్మ, వెంకటేశ్వరస్వామి, సాయిబాబా ఆలయాలలో స్వామి, అమ్మవార్లు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధరరెడ్డి, పార్నపల్లె కిశోర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చంద్రమౌళి, కొంగనపల్లె మురళి, తదితరులు పాల్గొన్నారు.

గజలక్ష్మీదేవి అలంకరణలో వాసవీమాత

పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరీదేవిని గజలక్ష్మీదేవిగా అలంకరించగా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు పూజలు జరిపించారు. అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేంద్రప్రసాద్, ఈఓ రమణ పర్యవేక్షించారు. బ్రాహ్మణపల్లె గంగమ్మ మహిషాసురమర్దినిగా, వేంకటరమణుడి రుక్మిణీ, సత్యభామ శ్రీకృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పార్వతీదేవిగా వాసవీమాత

వల్లూరు: వల్లూరు వాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపలో అమ్మవారిని బుధవారం రాత్రి పార్వతీదేవిగా అలంకరించి పూజలు జరిపారు. అక్కడ ఏర్పాటుచేసిన బొమ్మలకొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దుగ్గాయపల్లెలో వెలసిన చౌడేశ్వరీదేవిని మహిషాసురమర్దినిగా అలంకరించారు.

భక్తి శ్రద్ధలతో చండీ హోమం

వేంపల్లె: స్థానిక మెయిన్ బజార్ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ బుధవారం చండీహోమం నిర్వహించారు. ఇంద్రకంటి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు అమ్మవారిని అభిషేకించి హారతి ఇచ్చారు. బుధవారం రాత్రి వాసవీమాత గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం తలపనూరు గంగమ్మ తల్లి, గడ్డంవారిపల్లె రాజ రాజేశ్వరీదేవి మహిషాసురమర్దినిగా, కీర్తిపల్లె నల్లనమ్మ తల్లి శాకంబరిగా, అనిమెల బోగాదమ్మ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమివ్వగా, సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి మహాంకాళి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెండ్లిమర్రి: మండలంలోని పొలతల క్షేత్రంలో పార్వతీదేవిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. ఆలయ ఈవో క్రిష్ణా నాయక్, దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ రమణమ్మ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సింహాద్రిపురం: సింహాద్రిపురం పాతూరు చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి వెన్నపూసహుస్సేన్ పీరా పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు.

వేముల: గొల్లలగూడూరులో నల్లనమ్మ అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి



లక్ష్మీనారాయణ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబీకులు

లింగాల: మండలంలోని పార్నపల్లెలో దివంగత వైఎస్సార్ సన్నిహితుడు మోదుపల్లె లక్ష్మీనారాయణ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణ సమాధి వద్ద ఆయన కుటుంబసభ్యులు, భార్య రమాదేవి, కుమారుడు రమేష్, మనుమడు శశాంక్‌లు పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఆయన కుమారుడు రమేష్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి అండదండలతో పార్నపల్లె గ్రామాన్ని, చుట్టూ పక్కల గ్రామాల అభివృద్ధికి తన తండ్రి కృషి చేసి మన్ననలు పొందారన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోర్తి రాఘవయ్య, కె.లక్ష్మీనారాయణ, కె.పుల్లా నాయుడు, మణికంఠ ఫెర్టిలైజర్స్ యజమాని వెంగమనాయుడు, నాయుడు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జీఎస్టీతో రూ.2.5 లక్షల కోట్లు నష్టం



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జమ్మలమడుగు: కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల వస్తువులు, వ్యవసాయ సామగ్రిపై జీఎస్టీ తగ్గించడంతో కేంద్ర ప్రభుత్వానికి రూ.2.5 కోట్ల నష్టం వస్తుందని, రాష్ట్రానికి రూ.8 వేల కోట్ల నష్టం వస్తుందని ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం సభా భవనంలో జీఎస్టీపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్యాన్సర్ వంటి రోగాలకు సంబంధించిన మందులపై జీరో జీఎస్టీ పెట్టిందన్నారు. చాలా రకాల వస్తువులకు 18 నుంచి 5శాతం మాత్రమే జీఎస్టీ విధించిందని తెలిపారు. వ్యాపారులు జీఎస్టీ కలిపి అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు అనిత, రామమోహన్‌రెడ్డి, ఏవో శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కమలాపురం: రైతులు వినియోగించే వ్యవసాయ సామగ్రిపై జీఎస్టీ తగ్గించారని ఏఓ సరస్వతి తెలిపారు. కమలాపురం పట్టణం, తదితర గ్రామాల్లో బుధవారం జీఎస్టీ అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాక్టర్‌పై 12శాతం జీఎస్టీని, కేవలం 5 శాతానికే తగ్గించారన్నారు. డ్రోన్లపై 18 శాతం జీఎస్టీని ఐదు శాతానికే పరిమితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రత్న పుష్పమ్మ, జ్ఞానేశ్వరి, పాల్గొన్నారు.

సింహాద్రిపురం: సింహాద్రిపురం రైతు సేవా కేంద్రంలో జీఎస్టీ 2.0పై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఏఓ కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ శాతం తగ్గింపుతో వ్యవసాయ సామగ్రి, ట్రాక్టర్ల రేట్లు తగ్గాయన్నారు. రైతుకు పన్నుల భారం తగ్గించే దిశగా ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు.

వేంపల్లె: రైతులకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి అన్నారు. వేంపల్లె వ్యవసాయ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై రైతులు, ఎరువుల డీలర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఉపయోగించే వస్తువులు, ఇతర సామగ్రిపై గతంలో ఉన్న 18 శాతం జీఎస్టీ నుంచి ఐదు శాతానికి తగ్గించారని తెలిపారు. వ్యవసాయ ట్రాక్టర్లు, యంత్రాలు, డ్రోన్లు, డ్రిప్ పరికరాలు, ఆక్వా కల్చర్ పరికరాలు, పాలక్యాన్లు, 12 రకాల బయో పెస్టిసైడ్స్, యంత్రాలపై జీఎస్టీని తగ్గించడంతో రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

3 నుంచి రీసర్వే

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోఅక్టోబరు 3వ తేదీ నుంచి రీ సర్వే చేపట్టనున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే హరి పేర్కొన్నారు. దిగువపటన్నంలో 1110 ఎకరాలు, మైలవరంలో 1840, నాగిరెడ్డిపల్లెలో 1392, రాఘవపురంలో 701, కొండాపురంలో 1198, కోనవారిపల్లెలో 1894, రంగసాయపురంలో 203, గోపవరంలో 1469, కూలూరులో 2920, చిన్నసింగన్నపల్లె లో 1196, పెద్దజొన్నవరంలో 739 ఎకరాల్లోనూ రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులను సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

కమలాపురం: నగర పంచాయతీలో సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ చైర్మన్ మేరీ, కమిషనర్ ప్రహ్లాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మధు, తదితరులను ఘనంగా సత్కరించారు.